## వైభవంగా లక్ష్మీవేంకటేశ్వరస్వామికి పల్లకీ సేవ



స్వామివారికి పల్లకీ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

కృష్ణ, డిసెంబర్ 2 : మండలంలోని గుడెబల్లూర్ గ్రామంలోని స్వయంభూ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామి వారికివైభవంగా పల్లకీ సేవ నిర్వహించారు. అంతకు ముందు ఆలయ అర్చకులు వెంకోభాచారి స్వామివారికి అర్జిత సేవ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన పల్లకీ సేవలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో భక్తులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## వ్యాయామంతో ఆరోగ్యం పదిలం

- సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాలం



విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న పీఈటీలు

మక్తల్ టౌన్, డిసెంబర్ 2: ప్రతి రోజూ వ్యాయామం చేయడంతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని తగ్గఫ్‌వార్, సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి విశ్రాంత పీఈటీ గోపాల్ అన్నారు. వ్యాయామ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం మక్తల్ మినీ స్టేడియం నుంచి పుర వీధుల గుండా విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1920 డిసెంబర్ 2న చెన్నై నగరంలో హరీక్రౌబక్ వ్యాయామ విద్యా కళాశాలను స్థాపించి భారతదేశంలోని ఎంతోమంది విద్యార్థులకు వ్యాయామ విద్యను అందించారన్నారు. వ్యాయామ విద్య వల్ల విద్యార్థుల్లో భౌతిక నియంత్రణ, క్రమశిక్షణ, శరీరక ధృడత్వం పెంపొందుతుందన్నారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ ద్వారా ఎంతోమంది క్రీడాకారులు నేడు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడల్లో రాణిస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ చదువుతోపాటు వ్యాయామ విద్యను ప్రోత్సహించినప్పుడే అందరూ ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. కార్యక్రమంలో పీఈటీలు రమేశ్, అమ్రేశ్ , అబ్దుల్ రావూప్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గొర్రెల చోరీకి యత్నం

### అడ్డుకో బోయిన కాపరులపై రాళ్లతో దాడి

మాగనూరు డిసెంబర్ 2: గుర్తు తెలియని దుండగులు గొర్రెల చోరీకి యత్నించగా అడ్డుకోబోయిన కాపరులపై రాళ్లతో దాడిచేసిన ఘటన మండలంలో చోటు చేసుకున్నది. స్థానికుల కథనం మేరకు మండలంలోని కోల్పూర్ గ్రామానికి చెందిన కురువ వెంకటప్ప, కురువ శంకరప్పతో మరో ఇద్దరు శుక్రవారం సాయంత్రం తమ గొర్రెల మందను గ్రామ సమీపంలో ఓ పొలంలో కంచెలో ఉంచి రాత్రి భోజనం కోసమని ఇంటికి వెళ్లి వచ్చేసరికి అందులో దాదాపు 80కి పైగా గొర్రెలు అపహరణకు గురైనట్లు గుర్తించి వెంటనే గ్రామస్తులతో కలిసి గ్రామ పరిసరాల్లో వెత్తుకుంటూ వెళ్లారు. అడవి సత్యార గ్రామశివారులో దాచినట్లు గుర్తించి అక్కడకి వెళ్లగా పొదల్లో దాగిన దుండగులు రాళ్లతో దాడి చేశారు. మరికొందరు గ్రామస్తులు అక్కడికి చేరుకొని వారిని పట్టుకోడానికి యత్నించగా చీకట్లో పారిపోయినట్లు తెలిపారు. ఈ విషయంపై ఎస్సై మల్లేశ్‌ను వివరణ కోరగా బాధితులు రాత పూర్వకంగా ఫిర్యాదు ఇవ్వలేదని తెలిపారు. ఇలాంటి ఘటనలపై బాధితులు వెంటనే పోలీస్ స్టేషన్లో సమాచారం అందించాలని తెలిపారు.

## విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

ఊట్కూర్, డిసెంబర్ 2: అంగన్‌వాడీ టీచర్లు విధులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని సూపర్‌వైజర్ అంజలి అన్నారు. శనివారం మండలకేంద్రంలో నిర్వహించిన సెక్టార్ మీటింగ్‌లో ఆమె పాల్గొని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ, చిన్నారుల గ్రోత్ రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రాల్లో చిన్నారుల సంఖ్యను పెంచాలని, గర్భిణులు, బాలింతలకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం పంపిణీ చేయాలని సూచించారు. సమావేశంలో వివిధ గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# నేడు ఓట్ల లెక్కింపు

- బీఆర్ఎస్ గెలుపు ఖాయమన్న పార్టీ శ్రేణులు



ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు

మక్తల్, డిసెంబర్ 2: అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఆదివారం నిర్వ హించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ మాయాంక్ మిట్టల్ శనివారం ప్రకటనలో తెలిపారు. గత నెల 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గంలో 77.13 శాతం ఓట్లు పోలయ్యాయి. ఈవీఎంలను నారాయణపేట జిల్లా కేంద్రంలోని దత్తసాయి కళాశాలలో పోలీస్ బందోబస్తు మధ్య స్ట్రాంగ్ రూంలో భద్రపరిచారు. నియోజకవర్గంలో మొత్తం 2,42,254 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 1,19,403 మంది, స్త్రీలు 1,22,849 మంది ఉన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ, ఇండియన్ ఫార్వర్డ్‌బ్లాక్ అభ్యర్థులతో పాటు ఐదుగురు స్వతంత్ర అభ్యర్థులు బరిలో నిలిచారు. ని యోజకవర్గంలోని ఊట్కూర్, మక్తల్, మాగనూర్, కృష్ణ, నర్వ, అమరచింత, ఆత్మ కూర్, మరికల్, మదనాపూర్ మండలాల్లో ఏర్పాటు చేసిన 284 పోలింగ్ కేం ద్రాల్లో గురువారం జ రిగిన పోలింగ్‌లో మొ త్తం 1,86,860 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

### బీఆర్ఎస్ గెలుపు ఖాయం

అధికార బీఆర్ఎస్ అభ్యర్థి చిట్టెం రామ్మోహన్‌రెడ్డి హ్యాట్రిక్ విజయం ఖాయమని ఆపార్టీ నా య కులు అంటున్నారు. పార్టీ బీఫారం వచ్చినప్పటి నుంచి నియోజకవర్గంలో చిట్టెం రామ్మోహన్‌రెడ్డి విస్తృతంగా పర్యటించి సీఎం కేసీఆర్ సారథ్యంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లారు. అలాగే నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధి పనులను చూసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ ఎన్నికల్లో చిట్టెంకు మద్దతుగా సీఎం కేసీఆర్ ప్రజాఆశీర్వాద సభలో పాల్గొనగా , బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్, రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖల మంత్రి కేటీఆర్ మక్తల్‌లో నిర్వహించిన రోడ్‌షోలో పాల్గొన్నారు. ప్రజాఆశీర్వాద సభ, రోడ్‌షోకు ప్రజల నుంచి అనూహ్యస్పందన లభించింది. దీంతో చిట్టెం హ్యాట్రిక్ విజయం సాధిస్తారని, రాష్ట్రంలో ముచ్చటగా మూడోసారి కేసీఆర్ సారథ్యంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమని పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# ప్రభుత్వ కార్యాలయాలు వెలవెల

- వ్యాపారాలు లేక మూతపడ్డ హోటళ్లు, జిరాక్స్ సెంటర్లు



ప్రజల తాకిడి లేక బోసి పోయిన తాసీల్దార్ కార్యాలయం

ఊట్కూర్, డిసెంబర్ 2: శాసన సభ ఎన్నికల పోలింగ్ గురువారం రాత్రివరకు కొనసాగడంతో రాష్ట్ర ఎన్నికల అధికారి సూచనల మేరకు శుక్రవారం అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు ప్రకటించారు. కాగా శనివారం యధావిధిగా ప్రభుత్వ కార్యాలయాలు పని చేసినా అధికారులు, సిబ్బంది కౌంటింగ్ ఏర్పాట్ల కోసం జిల్లా కేంద్రానికి తరలి వెళ్లారు. కార్యాలయాల్లో అధికారులు అందుబాటులో లేక పోవడం, పనుల కోసం గ్రామాల నుంచి వచ్చే ప్రజలు సైతం కార్యాలయాల వైపు కన్నెత్తి చూడక పోవడంతో ప్రభుత్వ కార్యాలయాలు వెల వెలబోయాయి. గ్రామాల్లో ఎక్కడ నలుగురు వ్యక్తులు కలుసుకున్నా పోలింగ్ సరళిపై, అభ్యర్థుల గెలుపోటములపై చర్చించుకుంటున్నారు. శనివారం అధికారులు కౌంటింగ్ ఏర్పాట్లలో ఉండగా గ్రామాల్లోని నాయకులు తమ పార్టీ అభ్యర్థులకు ఎన్ని ఓట్లు పడ్డాయో అనే లెక్కల్లో మునిగి తేలుతున్నారు. మూడు రోజులుగా పరిసరగ్రామాల నుంచి మండల కేంద్రానికి ప్రజల రాక పోకలు లేక పోవడంతో తాసీల్దార్, ఎంపీడీవో కార్యాలయ సముదాయం వద్ద హోటళ్లు, టీ కొట్లు, జిరాక్స్ సెంటర్లు సైతం మూత పడ్డాయి. ఆదివారం ఎన్నికల ఫలితాలు పూర్తియితే సోమవారం నుంచి యధావిధిగా కార్యాలయాలకు ప్రజల తాకిడి పెరిగే అవకాశం ఉందంటున్నారు.

# ఆత్మకూరులో 72.08 శాతం పోలింగ్

### ఫలితాలపై నాయకుల్లో ఉత్కంఠ



పోలింగ్ కేంద్రం వద్ద ఓటు వేసేందుకు నిలబడ్డ ఓటర్లు

ఆత్మకూరు, డిసెంబర్ 2: ఆత్మకూరు పట్టణంలో 72.08 శాతం పోలింగ్ నమోదైంది ఆత్మకూరు మున్సిపాలిటీగా అవతరించిన తర్వాత మొదటిసారిగా జరుగుతున్న శాసనసభ ఎన్నికలు కాగా 11 పోలింగ్‌బూత్‌లో ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగింది. ఏ పోలింగ్ బూత్‌లో ఎంత శాతం పోలింగ్ నమోదైందోనని పరిశీలిస్తే మున్సిపాలిటీ మొత్తంగా 11,194 ఓట్లు ఉండగా 8,069 ఓట్లు పోలయ్యాయి. 72.08 పోలింగ్‌శాతం నమోదైంది. 188 ఖానాపూర్ పోలింగ్‌బూత్‌లో 1,264 ఓటర్లు ఉండగా 985 మంది ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకున్నారు. 207 ప్రభుత్వ జూనియర్ కళాశాల స్టేజి పక్కన ఏర్పాటు చేసిన పోలింగ్‌బూత్‌లో 1,230 ఓట్లకుగానూ 917 ఓట్లు పోల్‌కాగా 74.55 శాతం నమోదైంది. 208 ప్రభుత్వ జూనియర్ కళాశాల స్టేజీహాల్ వెనకాల ఏర్పాటు చేసిన పోలింగ్‌బూత్‌లో 1218కుగానూ 922 ఓట్లు పోల్‌కాగా 75.70 శాతం నమోదైంది.

హరిజనవాడ స్కూల్‌లో ఏర్పాటు చేసిన 209 పోలింగ్ బూత్‌లో 912 ఓట్లకుగానూ 684 ఓట్లు పోల్‌కాగా 75.00 శాతం నమోదైంది. 210 జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్‌బూత్‌లో 710కుగానూ 494పోల్‌కాగా 69.58 శాతం నమోదైంది. 211 జెడ్పీ బాలికల హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పీఎస్‌లో 767కుగానూ 532 పోల్‌కగా 69.36 శాతం నమోదైంది. 212 జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్‌బూత్‌లో 678కుగాను 479 పోల్‌కాగా 70.65 శాతం నమోదైంది. 213 జెడ్పీ బాలికల హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పీఎస్‌లో 1009కుగాను 730 పోల్‌కాగా 66.97 శాతం నమోదైంది. 214 ఉర్దూమీడియం హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పీఎస్‌లో 786కుగాను 541 పోల్‌కాగా 68.83 నమోదైంది. 215 ప్రభుత్వ జూనియర్ కళాశాల వెనక భాగంలో ఏర్పాటు చేసిన పీఎస్‌లో 1090కుగాను 730 పోల్‌కాగా 66.97 శాతం నమోదైంది. 216 పాత గ్రామ పంచాయతీలో ఏర్పాటుచేసిన పీఎస్‌లో 651కుగాను 429 పోల్‌కాగా 65.90 శాతం నమోదైంది. 217 హరిజన్‌వాడ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పీఎస్‌లో 879కుగాను 654 పోల్‌కాగా 74.40 శాతం నమోదైంది. పట్టణం మొత్తంగా 11,194 ఓట్లు ఉండగా ఇందులో 5,452 పురుషులు, 5,742 మహిళా ఓటర్లు ఉన్నారు. దీనికిగాను 4028 మంది పురుషులు, 4041 మంది మహిళా ఓటర్లు మొత్తంగా 8069 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.